సాక్షి చిత్తూరు

శుక్రవారం । 13 । జూన్ । 2025



టోకన్ల గోల

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివిలా తయారైంది జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి. - 8లో



బలవంతపు బదిలీలు..!

జిల్లాలో ఎస్జీటీల బదిలీల ప్రక్రియ ఉపాధ్యాయులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. - 8లో



మద్యం వ్యాన్ బోల్తా..

వడమాలపేట మండలం తడుకు ఆర్ఎస్ కూడలి వద్ద మద్యం లోడుతో వెళ్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. - 8లో

న్యూస్‌రీల్

నేటి 'ఫీజుపోరు' వాయిదా

చిత్తూరు కార్పొరేషన్: అహ్మదాబాద్ విమాన ప్రమాద నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న ఫీజుపోరు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్న ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మనోజ్‌రెడ్డి, విద్యార్థి విభాగం మాజీ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు వెల్లడించారు. తదుపరి కార్యక్రమ తేదీని త్వరలో పార్టీ ప్రకటిస్తుందన్నారు.

విమాన ప్రమాదంపై దిగ్భ్రాంతి



మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై మాజీ మంత్రి ఆర్కేరోజా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదంలో పలువురు మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. విమాన ప్రమాదం కారణంగా కలెక్టరేట్ వద్ద శుక్రవారం జరగాల్సిన నిరుద్యోగభృతి, ఫీజు పోరు నిరసన కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాకు మరో 13 వేల క్వింటాళ్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాకు మరో 13వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు వస్తాయని జిల్లా వ్యవసాయశాఖఅధికారి మురళీకృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు 26,349 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని, మళ్లీ ప్రతిపాదనలు పంపగా త్వరలో మరో 13వేల క్వింటాళ్ల కాయలు పంపిణీ చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.2.18 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీని గురువారం ఆలయ అధికారులు లెక్కించారు. ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో జరిగిన ఈ హుండీ లెక్కింపులో రూ.2,18,93,556 ఆదాయం వచ్చింది. బంగారం 29 గ్రాములు, వెండి 2.350 కిలోలుగా లెక్కగట్టారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.17,107, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.42,877 వచ్చింది. కార్యక్రమంలో ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, నాగేశ్వరరావు, కోదండపాణి, సుబ్రమణ్యానాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట ఫోన్ కాల్స్
– పోలీసులకు ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురికి ఫోన్ చేసి మోసం చేసి వ్యక్తిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ఓ వ్యక్తి వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పలు పోస్టులు ఉన్నాయని లక్షల్లో ముట్ట చెబితే ఆ పోస్టులు ఇప్పిస్తామని ఫోన్లు చేయడం ప్రారంభించాడు. ఇలా చాలామందికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లు చేయడంతో విషయం డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి దృష్టికి వెళ్లింది. దీంతో ఆ వ్యక్తి చేసిన ఫోన్ నెంబర్(9062823086)ను పోలీసులకు తెలియజేస్తూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వైద్యఆరోగ్య శాఖలో ఎటువంటి నోటిఫికేషన్లు విడుదల చేయలేదన్నారు. ఫేక్ ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని సూచించారు.

నేడు 1001 నుంచి ఎస్జీటీల బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎస్జీటీలకు 1001 సీరియల్ నెంబర్ నుంచి బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని షర్మన్ పాఠశాలలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు సీరియల్ నెంబర్ 1001 నుంచి 1500 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సీరియల్ నెంబర్ 1501 నుంచి 2000 వరకు బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

పది సప్లిమెంటరీ ఫలితాల్లో 24వ స్థానం

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర విద్యాశాఖ గురువారం విడుదల చేసిన పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచింది. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా బాలురు 4,080, బాలికలు 2,533 మొత్తం 6,613 మంది హాజరయ్యారు. ఇందులో బాలురు 2,275 మంది, బాలికలు 1,643 మొత్తం 3,918 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 55.76, బాలికలు 64.86 శాతం సాధించగా జిల్లా ఉత్తీర్ణత శాతం 59.25 నమోదైంది.

పేద పిల్లలు ఉన్నత చదువులు చదవడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదని మరోసారి నిరూపితమైంది. జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమైనా విద్యార్థులకు అందించాల్సిన కిట్లను సైతం సక్రమంగా అందించక చేతులెత్తేసింది. ఉండలు కట్టిన నాసిరకం మధ్యాహ్న భోజనం వడ్డించి హాజరైన అరకొర విద్యార్థుల సహనాన్ని పరీక్షించింది. తాగడానికి మంచినీళ్లు కూడా అందించకుండా గొంతు నొక్కేసింది. నూతన అడ్మిషన్లు, విద్యార్థుల తల్లిదండ్రులతో కళకళలాడాల్సిన పాఠశాలలను నిర్వీర్యం చేసింది. దీంతో విధిలేక పలువురు పేద పిల్లలు ప్రయివేటు బడుల వైపు అడుగులు వేయడం కనిపించింది. జిల్లాలో తొలిరోజు పాఠశాలల పునఃప్రారంభంపై 'సాక్షి'గ్రౌండ్ రిపోర్ట్..

తిరగబడి



పుస్తకాలు మాత్రమే ఇచ్చారని చూపుతున్న యాదమరి మండలం పి.గొల్లపల్లి పాఠశాల విద్యార్థులు

విద్యార్థికి 'మిత్ర ద్రోహం'!

- సమస్యల్లో సర్కారు బడులు
- పునఃప్రారంభమైనా పూర్తి స్థాయిలో అందని విద్యార్థి మిత్ర కిట్లు
- జాడలేని నూతన అడ్మిషన్లు
- పెదవి విరుస్తున్న తల్లిదండ్రులు
- గత ప్రభుత్వంలో పాఠశాల ప్రారంభం రోజే సకల వసతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా తొలిరోజు సర్కారు బడులు సమస్యలతో స్వాగతం పలికాయి. గత ఐదేళ్ల పాటు అధునాతన హంగులతో ఓ వెలుగు వెలిగిన బడులు ప్రస్తుతం దీన స్థితికి చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,462 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 1,48,430 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో తొలిరోజు విద్యార్థులను నేలపై కూర్చోబెట్టిన ఉపాధ్యాయులు

అందని విద్యార్థి మిత్ర కిట్లు

తొలి రోజే ప్రతి విద్యార్థికీ డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్లను అందజేయాల్సి ఉంది. కానీ జిల్లా వ్యాప్తంగా ఒక్క పాఠశాలలో కూడా పూర్తి స్థాయిలో విద్యార్థి మిత్ర కిట్లను అందజేలేదు. ఈ కిట్లలో విద్యార్థులకు బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, షూస్, డిక్షనరీ, వర్క్ బుక్స్ అందజేయాల్సి ఉంది. కానీ షూలు, బ్యాగులు, యూనిఫాం జిల్లాకు రాకపోవడంతో కేవలం పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

జిల్లా సమాచారం

పాఠశాలల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,949	52,469
ప్రాథమికోన్నత	158	10,293
ఉన్నత	355	85,668
మొత్తం	2,462	1,48,430

పత్తాలేని బడిబాట

అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రతి ఏటా వేసవి సెలవుల్లో, బడులు తెరిచిన సమయంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించేవారు. జిల్లాలోని ప్రతి మండలంలో క్షేత్ర స్థాయిలో టీచర్లు ప్రచారం చేసి బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బడిబాటకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. మౌలిక వసతుల కల్పన, విద్యార్థి కిట్లుకు మంగళం పాడేశారు. ఈ క్రమంలోనే అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.

ప్రభుత్వ బడులు వెలవెల

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలిరోజు నూతన అడ్మిషన్ల జాడ కనిపించలేదు. గత ఐదేళ్లలో అమలు చేసిన నాడు–నేడు, విద్యాకానుక, అమ్మఒడి, గోరుముద్ద, ట్యాబుల పంపిణీ, సీబీఎస్ఈ సిలబస్‌తో కొత్త పుంతలు తొక్కించారు. దీంతో పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులయ్యారు. కానీ నేడు ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేశారు. ఆయా పథకాలను నీరుగార్చడంతో విద్యార్థులు ప్రయివేటు బడుల వైపు అడుగులు వేస్తున్నారు. తొలి రోజే ప్రభుత్వ బడులన్నీ వెలవెలబోవడం కనిపించింది.




శిథిలావస్థకు చేరిన జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల



మూలకు చేరిన లక్షల విలువ చేసే తాగునీటి పరికరాలు



డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ బడిలో బయట నుంచి తీసుకొచ్చిన తాగునీరు



శ్రీరంగరాజపురం: నాసిరకం బ్యాగును చూపుతున్న తల్లిదండ్రులు



గిరింపేట నగరపాలక పాఠశాలలో మరమ్మతులకు లోనైన మరుగుదొడ్లు



చౌడేపల్లి: మద్దిమాకులపల్లి పాఠశాలలో ముద్దగా మధ్యాహ్నభోజనం



మద్దిమాకులపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

నాసిరకం బియ్యంతో అన్నం



నాసిరకం బియ్యంతో అన్నం పెడుతున్నారు. గతంలో గోరుముద్ద పథకాన్ని చాలాబాగా అమలు చేసేవారు. రోజు కొక మెనూ వడ్డించేవారు. ప్రస్తుతం తొలి రోజు నాసిరకం బియ్యంతో అన్నం పెట్టారు. ఇలాంటి మగ్గిన అన్నం పెడితే ఎలా..?.

– సుజమ్మ, విద్యార్థి తల్లి, శ్రీరంగరాజపురం

యూనిఫాం ఇవ్వలేదు



ఇంతకుముందు బడి తెరిచిన తొలి రోజే యూనిఫాం, పుస్తకాలు, నోటుపుస్తకాలు, షూలు, డిక్షనరీ, బ్యాగు ఒకేసారి ఇచ్చేవారు. ఇప్పుడు మా పాఠశాలలో యూనిఫాం ఇవ్వనే లేదు. ఎందుకు ఇవ్వలేదో తెలియదు. పుస్తకాలు కొన్నే ఇచ్చారు.

– పౌర్ణమి, విద్యార్థిని, శ్రీరంగరాజపురం మండలం

విలీనం మా కొద్దు

బైరెడ్డిపల్లె: తమ గ్రామంలో ఉన్న పాఠశాల విద్యార్థులను విలీనం చేస్తూ పక్క గ్రామానికి తరలించడం సమంజసం కాదని మండలంలోని మూగనపల్లె గ్రామస్తులు గురువారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు 30 మంది విద్యార్థులు 3, 4, 5 తరగతులు చదువుతున్నారన్నారు. విద్యార్థుల శాతం తక్కువగా ఉందని సుమారు 1.3 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాచుకుప్పం పాఠశాలకు విలీనం చేస్తూ విద్యార్థులను తరలించడం భావ్యం కాదన్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విద్యార్థులకు ప్రమాదాలు సంభవించడం ఖాయమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విలీనాన్ని రద్దు చేయాలని కోరారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం

కుప్పంరూరల్: ప్రభుత్వ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసే కార్యక్రమంలో భాగంగా కుప్పం మండలం, బలమందకొట్టం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను రద్దు చేసి విలీనం చేస్తారనే సమాచారంతో గురువారం స్థానికులు ఆందోళనకు దిగారు. తరగతులు తొలగిస్తే పిల్లలు బైరప్పకొటాలుకు వెళ్లి రావాల్సి ఉంటుందని, అంతదూరం వెళ్లిరావడం కష్టతరమని వాపోయారు. విదాయశాఖ అధికారులు స్పందించి వెంటనే విలీనాన్ని రద్దు చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



నిరసనకు దిగిన బలమందకొట్టం గ్రామస్తులు



నిరసన తెలుపుతున్న మూగనపల్లె పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు

వ్యవసాయశాఖలో బదిలీలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉమ్మడి జిల్లా వ్యవసాయశాఖ పరిధిలో పనిచేస్తున్న 22 మంది ఏఓలు, టీఏలను బదిలీచేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీకాంత్‌రెడ్డిని జిల్లా కార్యాలయం నుంచి ఎస్ఎంఎఫ్ మహదేవమంగళంకు, మాధవిని గుడిపాల నుంచి (డీటీసీ) జిల్లా కార్యాలయానికి, రక్యాబాను పెద్దపంజాణి నుంచి గంగవరానికి, చరితను యాదమరి నుంచి జిల్లా భూసార పరీక్ష కార్యాలయానికి, ఆజితను నగరి నుంచి కురబలకోటకు, హేమలతను పుంగనూరు నుంచి పెద్దపంజాణికి, నీలావేణిని భూసార పరీక్ష కార్యాలయం నుంచి సత్యసాయి జిల్లాలోని హిందూపురానికి, కళావతిని జిల్లా కార్యాలయం నుంచి ఎస్ఆర్‌పురానికి, జ్యోతమ్మ ను చౌడేపల్లి నుంచి పుంగనూరు టీఏగా, మాధవిని పులిచెర్ల నుంచి కేవీపల్లికి, హరిప్రసాద్‌ను సదుం నుంచి వైవీపాళ్యంకు, సుజాతను ఎస్ఎంఎఫ్ మహదేవ మంగళం నుంచి జిల్లా కార్యాలయంకు, సుధా (టీఏ) జిల్లా కార్యాలయం నుంచి పలమనేరుకు, రాజ్యలక్ష్మిని వి.కోట నుంచి గుడిపల్లికి, నాగరాజును పలమనేరు నుంచి సత్యసాయి జిల్లాకు, దీపను పుంగనూరు నుంచి యాదమరికి, సంగీత (డీటీసీ) జిల్లా కార్యాలయం నుంచి గుడిపాలకు, సుధారాణిని రొంపిచెర్ల నుంచి మదనపల్లికి, నర్మదను ఎస్ఆర్ పురం నుంచి ఎస్‌టీఎల్ తిరుపతికి, యామినిని కుప్పం (ఎస్‌టీఎల్) నుంచి టీఏగా పుత్తూరుకు, కల్యాణ్ బాబును పుంగనూరు నుంచి (ఎస్‌టీఎల్) తిరుపతికి, చిట్టిబాబును బంగారుపాళ్యం నుంచి నాగాలపురానికి బదిలీచేసింది.

ఏనుగుల విధ్వంసం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లెలో గురువారం తెల్లవారుజామున దాదాపు 12 ఏనుగులు మామిడి తోటలపై వీరవిహారం చేశాయి. మామిడి చెట్ల కొమ్మలు, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. రైతులు రవీంద్రారెడ్డి, కేశవరెడ్డికి చెందిన మామిడి తోటలో దూరి సర్వనాశనం చేశాయి. పంట చేతికొచ్చిన సమయంలో ఇలా జరగడం బాధేస్తోందని రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.



దేశిరెడ్డిగారిపల్లె వద్ద మామిడి తోటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

చిత్తూరులోని మామిడి కాయల మార్కెట్‌లో నిలిచిన వర్షపు నీరు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన బలమైన వర్షం పడింది. వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాకపోకాలకు ఆటంకం ఏర్పడింది. ప్రధానంగా కట్టమంచిలోని మామిడికాయల మార్కెట్ వర్షపు నీటితో నిండిపోయింది. మార్కెట్ లోపలి భాగం మొత్తం చెరువును తలపించింది. వాహనదారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. అధికారులు స్పందించి మార్కెట్‌లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అయ్యోర్లపై కక్ష సాధింపు

- సీఎం జిల్లాలో బదిలీల బాధలు
- కౌన్సెలింగ్ కేంద్రంలో ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాలో ఎస్జీటీలు బదిలీల బాధలతో నష్టపోతున్నారు. గత రెండు రోజులుగా చిత్తూరు జిల్లా కేంద్రంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ మొదలైన రోజు నుంచి ఇప్పటి వరకు పలు సమస్యలు ఎస్జీటీ టీచర్లను వేధిస్తున్నాయి. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో టీచర్లపై ఉన్నతాధికారులు, రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులు కక్ష సాధింపు ధోరణితో అన్యాయం చేస్తున్నారని బాధిత టీచర్లు వాపోతున్నారు. ప్రశ్నించే గొంతును నొక్కేసేలా ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరుకాని వ్వకుండా కౌన్సెలింగ్ కేంద్రం నుంచి భయాందోళనలు సృష్టించి తరిమేశారు. ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియలో స్పౌజ్ పాయింట్ల విషయంలో విద్యాశాఖ అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నారని ఎస్జీటీ టీచర్లు వాపోతున్నారు. న్యాయం చేయాలని కోరుతున్న టీచర్ల పై చులకన భావనతో జిల్లా విద్యాశాఖ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు రెండు గంటలపాటు ధర్నా

స్పౌజ్ విషయంలో జీవో నెంబర్ 22 కు వ్యతిరేకంగా బదిలీలు నిర్వహిస్తూ అన్యాయం చేస్తుండడంతో బాధిత టీచర్లు గురువారం కౌన్సెలింగ్‌ను బహిష్కరించి కేంద్రంలో ధర్నా నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. మ్యాన్యువల్ విధానంలో బదిలీలు నిర్వహించాలని చెప్పినందుకు విద్యాశాఖ అధికారులు కక్ష సాధింపులకు పాల్పడి అన్యాయం చేస్తున్నారని పలువురు బాధిత ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. బదిలీల నిర్వహణకు రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారిని అబ్జర్వర్ గా నియమించాలని సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



ధర్నాలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న బాధిత ఎస్జీటీ ఉపాధ్యాయురాలు దీపిక

జీవోకు వ్యతిరేకంగా బదిలీలు

ప్రభుత్వ జీవోకు వ్యతిరేకంగా చిత్తూరు విద్యాశాఖ అధికారులు బదిలీలు నిర్వహిస్తున్నారు. జీవో ప్రకారం స్పౌజ్ నమోదు చేసుకున్న టీచర్లు జిల్లాలో ఎక్కడైనా బదిలీ కోరుకునే అవకాశం ఉంది. ఈ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రస్తుతం పనిచేస్తున్న మండలంలోనే కోరుకోవాలని విద్యాశాఖ అధికారులు చెప్పడం అన్యాయం. ఎప్పుడూ ఒకే మండలంలో విధులు నిర్వహించాలా?. గతంలో ఎప్పుడూ ఇలాంటి అవకతవకల బదిలీలు జరగలేదు. కొత్త మండలాలకు వెళ్లాలని నిరీక్షించాం. కానీ ఫలితం లేకుండా పోతోంది.

– దీపిక, ఎస్జీటీ ఉపాధ్యాయురాలు

వరసిద్ధుని సేవలో ఎన్విరాన్మెంట్ కార్పొరేషన్ చైర్మన్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం రాష్ట్ర ఎన్విరాన్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దినేష్‌రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈవో పెంచల కిషోర్ ఆయనకు ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు.



చిత్రపటం అందజేస్తున్న ఈఓ పెంచలకిషోర్

క్లుప్తంగా

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబీకులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకి తవణంపల్లి మండలం, మైనగుండ్లపల్లి గ్రామానికి చెందిన రాజారెడ్డి రూ.లక్ష నగదును విరాళంగా ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాత కుటుంబానికి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

వ్యవసాయశాఖా మంత్రి జిల్లా పర్యటన వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా పర్యటనకు శుక్రవారం విచ్చేయాల్సిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెంనాయుడు పర్యటన అనివార్య కారణాలతో వాయిదా పడింది. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఆయన తదుపరి పర్యటన వివరాలు త్వరలో వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లె(పుంగనూరు): పుంగనూరు పట్టణ సమీపంలోని నక్కబండలో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. నక్కబండకు చెందిన షాహీదా(28) తన అవసరాల కోసం కొంతమంది వద్ద అప్పు చేసింది. వారి నుంచి వేధింపులు అధికం కావడంతో ఇంట్లో నిద్ర మాత్రలు మింగి అపస్మార స్థితికి చేరింది. కుటుంబ సభ్యులు ఆమెను పుంగనూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కాణిపాకం–తిరుపతి బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాజేష్ అనే వ్యక్తి మృతి చెందాడు. బుధవారం తన భార్య, ఇద్దరు పిల్లలతో చెర్లోపల్లె నుంచి చిత్తూరు వైపు వస్తుండగా.. ఎదురుగా వస్తున్న లారీ, స్కూటర్‌ను ఢీ కొట్టడంతో నలుగురూ గాయపడ్డ విషయం తెలిసిందే. రాజేష్, అతని భార్య పూర్ణిమ ఇద్దరి పరిస్థితి విషమించడంతో తమిళనాడు రాణిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం 4 గంటల ప్రాంతంలో రాజేష్ చనిపోయాడు. పూర్ణిమ పరిస్థితి విషమంగా ఉంది.

పందెం రాయుళ్ల అరెస్ట్

చౌడేపల్లె(పుంగనూరు): పుంగనూరు పట్టణంలోని పుంగమ్మ చెరువులో గురువారం కోడిపందాలు ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. ఎస్ఐ కథనం.. పుంగమ్మ చెరువు సమీపంలోని పాములకుంట వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 8 మందిని అదుపులోకి తీసుకోగా వారి వద్ద నుంచి పది కోడి పుంజులు, రూ.20,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టోకన్ల గోల



జిల్లాలో మామిడి రైతులు నానాతంటాలు పడుతున్నారు. పండిన పంటను అమ్ముకోవడానికి నరకం అనుభవిస్తున్నారు. తోతాపురి అమ్ముడుపోక విలవిల్లాడుతున్నారు. టోకన్ల పేరుతో ఫ్యాక్టరీ యజమానులు చుక్కలు చూపిస్తున్నారు. దీనికితోడు తోతాపురి కిలో రూ.6కే కొనుగోలు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రూ.8కే కొనుగోలు చేయాలని నిర్ణయించినా అవేవీ పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఇటు ఫ్యాక్టరీ యజమానులను ఒప్పించలేక.. రైతులకు సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

జిల్లాలో మామిడి రైతుల తంటాలు

- పండిన పంటను అమ్ముకోవడానికి అవస్థలు
- అమ్ముడుపోని తోతాపురి
- టోకన్ల పేరుతో నిబంధనలు
- అరకొరగా ఇస్తున్న ఫ్యాక్టరీలు
- పత్తా లేని అధికారులు



గుడిపాల మండలంలో టోకన్ల కోసం క్యూకట్టిన మామిడి రైతులు

కాణిపాకం: జిల్లాలో 56 వేల హెక్టార్లల్లో మామిడి సాగవుతోంది. ఇందులో తోతాపురి 39,895 హెక్టార్లు, నీలం 5,818, అల్ఫోన్సో 3,127, బేనీషా 3,895, మల్లిక 1,740 హెక్టార్లు, ఇతర రకాలు 1,526 హెక్టార్లలో సాగులో ఉంది. వీటిని కోత కోసి రైతులు చిత్తూరు, పలమనేరు, దామలచెరువు, బంగారుపాళ్యం ఇతరాత్ర మార్కెట్లకు తరలిస్తున్నారు. టేబుల్ రకం కాయల కోతలు చివరి దశకు చేరాయి. ప్రస్తుతం తోతాపురి కోతలు ఆరంభమయ్యాయి.

గందరగోళం

అధికారుల ఒత్తిడి మేరకు కొన్ని ఫ్యాక్టరీలు తోతాపురి కొనుగోలుకు టోకన్లు పంపిణీ చేస్తున్నాయి. అవి కూడా అరకొరగా ఇస్తున్నాయి. చాలా వరకు టోకన్లు కూటమి నేతల సిఫార్సులతో అమ్ముడుబోతున్నాయి. కొన్ని చోట్ల అసలు టోకన్లే ఇవ్వడం లేదు. టోకన్ల పంపిణీని వాయిదా వేస్తూ బోర్డులు పెట్టేస్తున్నాయి. గుడిపాల మండలంలోని ఫ్యాక్టరీల వద్ద రైతులు గురువారం బారులు తీరారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో కొంతవరకు టోకన్లు ఇచ్చి నిలుపుదల చేశారు. చిత్తూరు నగరంలోని ఓ ఫ్యాక్టరీలో టమాట గుజ్జు తయారీని కొనసాగిస్తున్నారు. మరో ఫ్యాక్టరీ టోకన్ల జారీని వాయిదా వేస్తూ బోర్డు పెట్టేసింది. టోకన్ల పంపిణీలో సరైనా స్పష్టత లేక రైతులను ఫ్యాక్టరీలు తిప్పించుకుంటున్నాయి.

తోతాపురికి టోకన్లు

జిల్లాలో అత్యధికంగా తోతాపురి రకం సాగవుతోంది. ఈ కాయలు 90శాతం దాకా పక్వానికి వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 39,895 హెక్టార్లకు గాను 4,99,274 మెట్రిక్ టన్నుల దాకా దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. టేబుల్ రకాలను మాత్రం రైతులు కోతకోసి మార్కెట్, ఫ్యాక్టరీలకు తరలించారు. తోతాపురి పంటను ఫ్యాక్టరీలు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపడం లేదు. దీంతో రైతులు రోడెక్కారు. స్పందించిన కూటమి ప్రభుత్వం కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీలను ఆదేశించింది. ప్రభుత్వం తరఫున కిలోకు రూ.4 చొప్పున్న ప్రోత్సాహక నిధి ఇస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికారుల పోరు పడకలేక కొన్ని ఫ్యాక్టరీలు కాయల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. టోకన్ల సిస్టమ్‌ను తీసుకొచ్చాయి. ఈ కారణంగా ఫ్యాక్టరీల వద్ద గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

రాత్రి లోడేత్తేస్తున్నాయి

తమిళనాడులోని క్రిష్ణగిరి, ఇతరాత్ర ప్రాంతాల నుంచి వచ్చే కాయలకు జిల్లాలోని ఫ్యాక్టరీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా తమిళనాడు కాయలను దిగుమతి చేసుకుంటున్నాయి. అక్కడ తోతాపురి కిలో రూ.4, రూ.5కు కొనుగోలు చేస్తున్నాయి. అక్కడి వ్యాపారులు రూ.5కే ఫ్యాక్టరీకి డెలివరీ ఇస్తున్నారని జిల్లాలోని ఫ్యాక్టరీ నిర్వాహకులు చెబుతున్నారు.

ముఖం చాటేస్తున్న ఫ్యాక్టరీలు

జిల్లాలో సాగయ్యే మామిడి ఫలాల్లో టేబుల్ రకాలు రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. తోతాపురి కాయలు గుజ్జు తయారీకి తరలుతుంటాయి. ఈ కాయలన్నీ కూడా జిల్లాలోని 47 గుజ్జు పరిశ్రమలకు చేరుతుంటాయి. గతేడాది తయారీ చేసిన గుజ్జు నిల్వలు అలాగే ఉండడంతో ఈ సారి మామిడి కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నాయి. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా ఫ్యాక్టరీ యజమానులు ముఖం చాటేస్తున్నారు.

జిల్లా సమాచారం

మామిడి రకం	హెక్టార్లు	దిగుబడి అంచనా
తోతాపురి	39,895	49,9274
నీలం	5,818	64,991
అల్ఫోన్సో	3,127	26,404
బేనీషా	3,895	28,867
మల్లిక	1,740	13,919
ఇతర రకాలు	1,526	11,779

ప్రస్తుతం మార్కెట్లో మామిడి ధరలు

రకం	ధర(కిలో)
చందూర	రూ.4
బేనీషా	రూ.10–రూ.20
మల్లిక	రూ.7–రూ.20
కాలేపాడు	రూ.20– రూ.30
ఇమామ్ పసంద్	రూ.40–రూ.70
తోతాపురి (టేబుల్ రకం)	రూ.10–రూ.13
అల్ఫోన్సో	రూ.20– రూ.30

రూ.8 కాదు.. రూ.6కే!

తోతాపురి కిలో రూ.8కి కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇది అమల్లోకి రాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అతికష్టం మీద ఫ్యాక్టరీలు రూ.6కు కొనుగోలు చేస్తామని చెబుతున్నాయి. ఇదీ కూడా కొన్ని రోజుల ముచ్చటేనన్ని రైతులు దిగాలు చెందుతున్నారు.

పర్మిట్ల కోసం పడిగాపులు

గుడిపాల: పర్మిట్ల కోసం మామిడి రైతులు తెల్లవారు జాము నుంచే పడిగాపులు కాశారు. గురువారం గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్, తాసా జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద గంటల తరబడి క్యూలో నిరీక్షించారు. ఎవ్వరూ స్పందించక పోవడంతో ఫ్యాక్టరీ ఎదుట నిరసనకు దిగారు. గుడిపాల తహసీల్దార్ జయంతి, ఎస్ఐ రామ్మోహన్ ఘటనా స్థలానికి చేరుకుని ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు జరిపారు.

200 మందికి టోకెన్లు

200 మందికి టోకన్లు అందజేశారు. దీంతో వివాదం సర్దుమణిగింది. 17వ తేదీ వరకు టోకన్లు ఇవ్వడం కుదరదని ఫ్యాక్టరీ నిర్వాహకులు తేల్చిచెప్పారు. ఇదిలావుండగా తమిళనాడు నుంచి వస్తున్న మామిడి కాయలకే అధికంగా ఫ్యాక్టరీ వారు ప్రాధాన్యత చూపుతున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. లారీల ద్వారా లోడ్లు వచ్చిన వెంటనే టోకన్లు లేకుండానే అన్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు.



ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్ఐ

నాలుగు రోజులుగా తిరుగుతున్నా



టోకన్లు ఎప్పుడు ఇచ్చారో తెలియడం లేదు. నాలుగు రోజులుగా ఫ్యాక్టరీల చుట్టూ తిరుతున్నా. గురువారం టోకన్ల కోసం ఫ్యాక్టరీ కాడికి వస్తే.. టోకన్లు ఇప్పుడు ఇచ్చేది లేదంటున్నారు. సోమవారం రమ్మని బోర్డు పెట్టేశారు. నేను 3.5 ఎకరాల్లో మామిడి సాగు చేశా. కాయలు రాలిపోతున్నాయి.

– దశరథన్, మాపాక్షి, చిత్తూరు

దొంగతనంగా తీసుకొచ్చేస్తున్నారు



చిత్తూరు కాయలను వద్దని..దొంగతనంగా బయట కాయలను తీసుకొచ్చేస్తున్నారు. క్రిష్ణగిరి కాయలు దించుకుంటున్నారు. రాత్రికి...రాత్రి..ఆ కాయలను తీసుకొస్తుంటే అడ్డుకునే వారులేరు. అందుకే జిల్లా కాయలను వద్దంటున్నారు. ఈ టోకన్ల సిస్టం తీసేసి...కాయలు కొనుగోలు చేసేలా చూడాలి.

– నాగరాజు, ఎల్‌బీపురం, చిత్తూరు

మద్యం వ్యాన్ బోల్తా

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం, తడుకు ఆర్ఎస్ కూడలి వద్ద మద్యం లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తాపడింది. రేణిగుంట నుంచి మద్యం లోడుతో వడమాలపేట మీదుగా విజయపురం వెళ్తున్న సమయంలో తడుకు ఆర్ఎస్ వద్ద టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. వ్యాన్‌లోని మద్యం బాటిళ్లు రోడ్డుపై పడ్డాయి. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఎస్ఐ ధర్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

డయేరియా నివారణపై అవగాహన



అధికారులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ

చిత్తూరు రూరల్(కాణిపాకం): డయేరియా నివారణ కార్యక్రమ ఉద్దేశంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి ఆదేశించారు. ఆమె గురువారం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ శిశుమరణాల నివారణే ధ్యేయంగా అధికారులు పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలోని వైద్యబృందం ఇంటింటా సర్వే చేపట్టి 0–5 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించాలన్నారు. ఈ సర్వేను ఈ నెల 16 నుంచి జూలై 31వ తేదీ వరకు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. డయేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఓ హనుమంతరావు, డీఎంఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంగజాతరకు రానీయకుండా దాడులు



డీఎస్పీకి విన్నవించేందుకు వచ్చిన దళితులు

పలమనేరు: తమ గ్రామంలో బుధవారం జరిగిన గంగ జాతరలో భాగంగా ఆలయంలో జరిగే పూజలకు తమను రావద్దని గ్రామ పెద్దలు అభ్యంతరం తెలిపారని, దీనిపై ప్రశ్నించగా తమపై దాడులు చేసి గాయపరిచారని గంగవరం మండలం, గుండుగల్లు దళితులు వాపోయారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక డీఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో జాతరను అన్ని కులాలు కలిసి చేసుకుందామని చెప్పి తీరా ఆలయంలోకి తమను ప్రవేశించకుండా అడ్డుకున్నారన్నారు. దీనిపై అడిగినందుకే దాడి చేశారని తెలిపారు. డీఎస్పీకి విన్నవించిన వారిలో ఆ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, వెంకటరమణ, మునిరత్నం తదితరులున్నారు.

ఆ జాబితా సమర్పించండి



మాట్లాడుతున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్ల నియామకం జాబితాలను సమర్పించాలని డీఆర్‌వో మోహన్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లైములకు సకాలంలో స్పందించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా మరణించిన ఓటర్ల జాబితాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. వారి పేర్లను జాబితాలో తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రక్రియ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జరుగుతోందన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు పేర్లు నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లైమ్స్ పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాల వారీగా బూత్‌లెవల్ ఏజెంట్‌ల నియామకానికి ఫారం 2 సమర్పించాలన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణకు 15,497 దరఖాస్తులు అందగా వాటిలో 1,598 పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్, సురేంద్ర, గంగరాజు, పరదేశి పాల్గొన్నారు.

బస్సులో ల్యాప్‌టాప్‌ల చోరీ

పలమనేరు: పలమనేరు సరిహద్దు, కర్ణాటక బోర్డర్‌లోని ఓ హోటల్ వద్ద టిఫిన్ కోసం ఆగిన బస్సులో ప్రయాణికులకు చెందిన రెండు ల్యాప్‌టాప్‌లు చోరీ జరిగిన ఘటన గురువారం వెలుగుచూసింది. తిరుపతి, చిత్తూరుకి చెందిన సాఫ్ట్‌వేర్‌లు బెంగళూరుకు బస్సులో బయలుదేరారు. వారు వెళుతున్న బస్సు రాష్ట్ర సరిహద్దులోని ఓ హోటల్ వద్ద టిఫిన్ కోసం ఆగింది. ప్రయాణికులు హోటల్‌లోకి వెళ్లగా అదే సమయంలో అక్కడున్న దొంగలు బస్సులోకి ప్రవేశించి రెండు ల్యాప్‌టాప్‌లను చోరీ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు హోటళ్ల వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

– చెరువులో మునిగి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



శ్రీనివాసులురెడ్డి (ఫైల్)

గంగవరం: ఈత సరదా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణం తీసింది. ఈ ఘటన మండలంలో గురువారం వెలుగు చూసింది. వివరాలు.. బైరెడ్డిపల్లి మండలం, ఇళ్లూరిండ్లు గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు శ్రీనివాసులురెడ్డి(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను బుధవారం గంగవరం మండలం, పత్తికొండ పంచాయతీ, అటుకురాళ్లపల్లి గ్రామంలో జరిగే గంగ జాతరకు అమ్మమ్మ ఇంటికి కుటుంబ సమేతంగా వచ్చాడు. పండుగలో అమ్మవారికి మొక్కులు చెల్లించిన అనంతరం శ్రీనివాసులురెడ్డి, అతని మిత్రులతో కలిసి అదే గ్రామంలోని ఈతల కుంటలో సరదాగా ఈత కొడదామని వెళ్లారు. అలా వెళ్లిన నలుగురిలో ముగ్గురు చెరువులోంచి బయటకు వచ్చేయగా శ్రీనివాసులురెడ్డి వెలుపలికి రాలేదు. చెరువు అడుగున బురదలో కూరుకుపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువులో ఎంత ఎదికినా కనిపించలేదు. మరుసటి రోజున మళ్లీ చెరువులో గాలింపు చేపట్టగా మృతుడి ఆచూకీ లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతనికి పది రోజుల క్రితమే పాప జన్మించింది. దీంతో అమ్మమ్మ గారి ఊరితో పాటు సొంత గ్రామం ఇళ్లూరిండ్లులో విషాదఛాయలు అలుముకున్నాయి.

కూటమి పాలనలో ఆలయాల విధ్వంసం

- హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న కూటమి ప్రభుత్వం
- ఆలయ ధ్వంసమైన ప్రాంతాన్ని పరిశీలించిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

సాక్షి, టాస్క్ ఫోర్స్ : 'కూటమి ప్రభుత్వంలో మనుషులకే కాదు.. దేవాలయాలకు రక్షణ లేకుండా పోయింది.. అమ్మవారి విగ్రహానికి కాళ్లు, చేతులు నరకడం సనాతన ధర్మమా..? హిందువుల మనోభావాలను కూటమి సర్కారు దెబ్బతీస్తోంది అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆలయాన్ని ధ్వంసం చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుచానూరు సమీపంలోని శ్రీ ఆది వారాహి అమ్మవారి ఆలయాన్ని కూల్చివేసిన శిథిలాలను గురువారం ఆయన పార్టీ నాయకులు, హిందూ సంఘాలతో కలసి పరిశీలించారు. ఆలయం ధ్వంసం చేయడంతో పాటు విగ్రహాలను, శిథిలాలను కాలువలో పడేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతల దాడుల్లో గాయపడిన సిబ్బందిని పరామర్శించారు. అనంతరం అమ్మవారి ఆలయ ఉపాచారకులు శ్రీ మహారుద్ర వారాహి స్వామివారిని ఓదార్చారు. అనంతరం కూటమి నేతలు చేసిన దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దారుణం

శ్రీ ఆదివారాహి అమ్మవారి ఆలయాన్ని ఇసుక, మట్టి మాఫియా ముఠాలు నేలమట్టడం చేయడం దారుణమైన ఘటన అని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మండిపడ్డారు. శిథిలాలను ఒక మురుగు కుంటలో పడేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత దారుణమైన ఘటన జరిగినప్పటికి పవన్ కల్యాణ్ స్పందించకపోవడం వెనుక ఏ కుట్ర దాగుందని ఆయన ప్రశ్నించారు.

ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే అరాచకాలు

టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రోత్సాహంతోనే టీడీపీ నాయకులు ఇసుక, మట్టి మాఫియాకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆలయాన్ని నేలమట్టం చేసిన వారిని ఇప్పటి వరకు పోలీసులు అరెస్టు చేయలేదంటే దాని వెనుక కూటమి నాయకుల హస్తం లేదంటారా అని మండిపడ్డారు.

బలవంతపు బదిలీలు..!

ఇచ్చిన మాట ప్రకారం మాన్యువల్ విధానంలో ఎస్జీటీల బదిలీలు నిర్వహించాలని అయ్యోర్లు ఇటీవల రొడ్డెక్కి ధర్నాలు చేసిన విషయం తెలిసిందే. దీంతో అసలు బండారం బయటపడుతుందని భావించిన కూటమి సర్కారు ఒక మెట్టు దిగింది. మాన్యువల్ బదిలీలకు అంగీకారం తెలిపింది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంలోని షర్మన్ పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రహసనంగా మారుతోంది. అధికారులు ఏదో ఒక సమస్యను చూపి అయ్యోర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి టీడీపీని నమ్మిన పాపానికి తగిన శాస్తి జరుగుతోందని అయ్యోర్లు లోలోపలే మదనపడుతున్నారు.

- రోజుకొక వింత ధోరణి వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు
- న్యాయం చేయాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని వైనం
- గురువారం మూడు గంటలకు పైగా ఆగిన కౌన్సెలింగ్ ప్రక్రియ
- కౌన్సెలింగ్ కేంద్రంలో ధర్నా చేసిన బాధిత ఎస్జీటీ టీచర్లు




కౌన్సెలింగ్ కేంద్రం గేటు వద్ద బైఠాయించిన ఎస్జీటీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజు నుంచి ఏదో ఒక వివాదం కొనసాగుతూనే ఉంది. కౌన్సెలింగ్ ప్రక్రియ ఆపడం.. కొనసాగించడం చేస్తున్నారు. తాజాగా ఈ నెల 12వ తేదీన స్పౌజ్ కోటా విషయంలో అన్యాయం జరుగుతోందని బాధిత ఎస్జీటీ టీచర్లు గురువారం కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు.

కౌన్సిలింగ్ కేంద్రం వద్ద ధర్నా చేశారు. స్పౌజ్ విషయంలో జీవో 22కు వ్యతిరేకంగా విద్యాశాఖ అధికారులు బదిలీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో మధ్యాహ్నం మూడు గంటలకు పైగాకౌన్సెలింగ్‌ను ఆపేసారు. టీచర్ల ధోరణితో విస్తుపోయిన డీఈవో వరలక్ష్మి ఆగ్రహంతో కౌన్సెలింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఆర్‌వో మోహన్‌కుమార్, పోలీసులు కౌన్సెలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని బాధిత టీచర్లతో చర్చలు జరిపారు.

స్పౌజ్ సమస్యలే అధికం



స్పౌజ్ పాయింట్లకు సంబంధించి ఆదేశాలున్న జీవో

ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్జీటీల కౌన్సిలింగ్ ప్రక్రియలో స్పౌజ్ సమస్య టీచర్లను నష్టపోయేలా చేస్తోంది. సీనియారిటీ నంబర్ 703కు ప్రక్రియ వచ్చేసరికి స్పౌజ్ సమస్యతో బాధిత మహిళా టీచర్ దీపిక న్యాయం చేయాలంటూ కౌన్సెలింగ్‌ను అడ్డుకున్నారు. మరికొందరు స్పౌజ్ బాధితులు ఆమెకు మద్దతు తెలిపారు. బాధిత టీచర్ దీపిక, ఆమె భర్త ఇద్దరూ ఎస్జీటీలే. ఆమె బుచ్చినాయుడుకండ్రిగలోను, ఆమె భర్త కేవీబీపురంలో పనిచేస్తున్నారు. వారు తప్పనిసరి బదిలీల్లో ఉన్నారు. బదిలీ జీవో ప్రకారం ఆమె ఉమ్మడి చిత్తూరులో ఎక్కడైనా కోరుకునే అవకాశం ఉంది. విద్యాశాఖ అధికారులు కేవీబీపురం మండలంలోనే కోరుకోవాలంటూ ఆమెపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. దీంతో జీవో 22ను అమలుచేసి న్యాయం చేయాలని బాధిత టీచర్ పట్టుబట్టి మరికొంత మంది బాధిత టీచర్లతో ధర్నా చేపట్టింది. చివరికి డీఆర్‌వో మోహన్ కుమార్, పోలీసులు కౌన్సిలింగ్ కేంద్రంలోకి ప్రవేశించారు. బాధిత టీచర్లతో చర్చలు జరిపారు. జీవో ప్రకారం బాధిత టీచర్ దీపికకు శ్రీకాళహస్తి కోరుకునేలా అవకాశం కల్పించారు. సమస్య పరిష్కారం అయ్యాక విద్యాశాఖ అధికారులు కౌన్సిలింగ్ ప్రక్రియను కొనసాగించారు.